సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 30 । మే । 2024



బాధితుల న్యాయపోరాటం

పుడమి ప్రాజెక్ట్ కంపెనీ నిర్వాహకులపై న్యాయ పోరాటం చేసేందుకు బాధితులు సిద్ధమవుతున్నారు.

- 8లో



మరమ్మతులు సున్నా!

రామన్నపేట మండలంలోని వెల్లంకి-నుంకెనపల్లి, వెల్లంకి-గొల్నేపల్లి రోడ్లు అధ్వానంగా మారాయి.

- 9లో

గరిష్ఠం / కనిష్ఠం
$42^0 / 31^0$

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

11న మోత్కూరు పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

మోత్కూరు : మోత్కూరు పీఏసీఎస్ చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డిపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై జూన్ 11న ఉదయం 11 గంటలకు ఓటింగ్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే సమావేశంలో పాల్గొనాలని చైర్మన్‌తో పాటు డైరెక్టర్లకు డీసీఓ ప్రవీణ్‌కుమార్ బుధవారం నోటీసులు జారీ చేశారు. చైర్మన్ అక్రమాలకు పాల్పడ్డారని ఆయనపై అవిశ్వాసం ప్రతిపాదిస్తూ వైస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, మరో ఎనిమిది మంది డైరెక్టర్లు ఈ నెల 21న డీసీఓకు సంతకాలతో కూడిన నోటీసు అందజేశారు. ఈ నేపథ్యంలో ఓటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు.

కొలతల్లో తేడా రావద్దు



యూనిఫాంను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

బీబీనగర్ : యూనిఫాం కొలతల్లో తేడా రాకుండా చూసుకోవాలని డీఆర్‌డీఓ కృష్ణన్ సూచించారు. బీబీనగర్ మండలంలోని జియాపల్లిలో మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. విద్యార్థుల యూనిఫాం కుట్టే బాధ్యతలను ప్రభుత్వం స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించిందని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. గడువులోపు పూర్తి చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట వెలుగు ఏపీఎం శ్రీనివాస్, సీసీ మల్లేశం తదితరులు ఉన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం నిత్య కైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువ జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అర్చన, అభిషేకం చేశారు. అలాగే ప్రధానాలయ ముఖ మండపం, ప్రథమ ప్రాకార మండపంలో అష్టోత్తర, శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం, నిత్యకల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

భువనగిరి క్రైం : స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం భువనగిరి పోలీసులు భువనగిరి - నల్లగొండ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. నంబర్ ప్లేట్, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు, హెల్మెట్ ధరించని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. వాహనాలకు విధిగా నంబర్ ప్లేట్ ఉండాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, ఇస్తే వాటి యజమానులే పూర్తి బాధ్యత వహించాలని, అవసరమైతే జైలు శిక్ష కూడా అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. తనిఖీల్లో ట్రాఫిక్ సీఐ మధుసూదన్, ఎస్‌ఐ వెంకటేశ్, విజయ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అణువులో భగవంతుడు ఉన్నాడు

రామగిరి(నల్లగొండ) : ప్రతి అణువులోనూ భగవంతుడు ఉన్నాడని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి పేర్కొన్నారు. నల్లగొండలో అక్కినేపల్లి లక్ష్మణరావు, శ్రీదేవి దంపతుల నివాసంలో ప్రముఖ ప్రవచన కర్త నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య ఆధ్వర్యంలో జరుగుతున్న భాగవత సప్తాహానికి చినజీయర్‌స్వామి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. భాగవత సప్తాహం చేయడమే కాకుండా భాగవతంలో విన్నదాన్ని ఆచరించే ప్రయత్నం చేయాలని భక్తులకు సూచించారు. భగవంతుడిని ప్రేమించడం నేర్చుకోవాలన్నారు.



లక్ష్మీ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరిస్తూ ఎండనుంచి ఉపశమనం పొందుతున్న భక్తులు

పుణ్యస్నానం.. ఉపశమనం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రానికి వచ్చిన భక్తులు లక్ష్మీ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించడంతో పాటు మండుటెండనుంచి ఉపశమనం పొందుతున్నారు. గత రెండు రోజులుగా మళ్లీ ఎండ తీవ్రత పెరిగింది. గరిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో భక్తులు అల్లాడిపోతున్నారు. కొండ దిగువన ఉన్న లక్ష్మీ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి ఉపశమనం పొందుతున్నారు. గంటల తరబడి పుష్కరిణిలోనే సందడి చేస్తున్నారు.

మళ్లీ భగ్గుమన్న భానుడు

- యాదగిరిగుట్టలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రత
- జిల్లాను ఎల్లో జోన్‌గా ప్రకటించిన వాతావరణ శాఖ

భువనగిరిటౌన్ : జిల్లాలో బుధవారం రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. యాదగిరిగుట్టలో 44.1, ఆలేరు 43.2, మోత్కూరు 43.1, వలిగొండ 43.1, గుండాల 42.7, అడ్డగూడూరు 42.3, భువనగిరి 42.1, సంస్థాన్‌నారాయణపురంలో 41.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా మండలాల్లోనూ 41డిగ్రీలకు పైగా ఎండ కాసింది. కాగా ద్రోణి ప్రభావంతో మొన్నటి వరకు మబ్బులు కమ్ముకున్నాయి. అక్కడక్కడ వర్షాలు కురువడంతో వాతావరణం చల్లబడింది. రెండు రోజులుగా భానుడు మళ్లీ భగ్గుమంటున్నాడు. ఎండ తీవ్రత పెరిగింది. ఉదయం 10 తర్వాత బయటకు వెళ్లాలంటేనే జనం జంకుతున్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతల కారణంగా జిల్లాను ఎల్లో జోన్‌గా వాతావరణ శాఖ ప్రకటించింది. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

మూత'బడులకు' మంచి రోజులు!

విద్యార్థులు లేరని గతంలో 28 పాఠశాలలు మూసివేత

- వచ్చే నెలనుంచి తెరిపించేందుకు విద్యాశాఖ సన్నాహాలు
- బడిబాట, ఆదర్శ కమిటీల ద్వారా ప్రచారం చేయాలని నిర్ణయం
- విద్యార్థుల లెక్కలు తీసే పనిలో నిమగ్నమైన అధికారులు

భువనగిరి : విద్యార్థులు లేరంటూ మూసివేసిన ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. 2024 విద్యా సంవత్సరం పునః ప్రారంభం రోజున వాటిని తెరిచేలా సన్నాహాలు చేస్తోంది. మూతబడిన పాఠశాలల్లోని పిల్లలు ఎక్కడ చదువుతున్నారు, తెరిస్తే ఎంత మేరకు మళ్లీ వచ్చే అవకాశాలు ఉన్నాయి.. అనే విషయాలపై సీఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, మండల విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. విద్యార్థులు ఎంతమంది ఉన్నా సరే.. పాఠశాలలు నడపాలని, ఇందుకు అవసరమైన ఉపాధ్యాయులను మెగా డీఎస్సీ ద్వారా నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిసెంబర్‌లో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ స్కూల్ ఉండాల్సిందేనని, మూసివేసిన బడులను పునరుద్ధరించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు జిల్లాలో మూసివేసిన పాఠశాలలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు లెక్కలు తీసే పనిలో విద్యాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు.

ఉపాధ్యాయులున్నా.. విద్యార్థులు లేరు

జిల్లా వ్యాప్తంగా 421 గ్రామ పంచాయతీల్లో 712 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 481 ప్రాథమిక, 68 ప్రాథమికోన్నత, 163 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులున్నా విద్యార్థుల్లేక మూతబడ్డాయి. వాటిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేశారు. అక్కడి విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్తున్నారు. సాధారణంగా కిలో మీటరు లోపు ప్రాథమిక, మూడు కిలో మీటర్ల లోపు ప్రాథమికోన్నత, 5 కిలో మీటర్ల లోపు ఉన్నత పాఠశాలలు ఉండాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది. దీని ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ పాఠశాల నడపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.



భువనగిరి మండలం పెంచికల్‌పహాడ్‌లో విద్యార్థులు లేక మూతబడిన ప్రాథమిక పాఠశాల

పిచ్చిమొక్కలతో నిండిన స్కూళ్లు

మూతబడిన పాఠశాలల్లో పిచ్చిమొక్కలు మొలిచి కళావిహీనంగా ఉన్నాయి. కొన్ని పాఠశాలలను స్థానికులు తమ అవసరాలకు ఉపయోగించుకుంటున్నారు. మరికొన్ని అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. వీటిని పునరుద్ధరించడం ద్వారా ఆయా పాఠశాలలకు మళ్లీ మంచి రోజులు రానున్నాయి. పిల్లలు స్థానికంగానే చదువుకునే అవకాశం కలగనుంది.

28 జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు

విద్యార్థులు లేక జిల్లా వ్యాప్తంగా 28 పాఠశాలలు మూసివేసినట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారు. వీటిని వచ్చే నెలలో తెరిపించేందుకు కసరత్తు చేస్తున్నారు. మూసివేత సమయంలో ఆయా పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య తీస్తున్నారు. జూన్ 1వ తేదీ నుంచి నిర్వహించే బడిబాట కార్యక్రమంలో అధికారులు ఆయా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను కలవనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించనున్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పిల్లలు తిరిగి స్కూళ్లకు వచ్చేలా ప్రచారం కల్పించనున్నారు.

ఉన్నతాధికారులకు వివరాలు పంపాం



జిల్లాలో పంచాయతీల ప్రకారం విద్యార్థుల్లేక మూతబడిన పాఠశాలలు 28 ఉన్నట్లుగా గుర్తించాం. సేకరించిన వివరాలను విద్యాశాఖ ఉన్నతాధికారులకు అందజేశాం. జూన్ 1వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమం ద్వారా మూసిఉన్న పాఠశాలలను తెరుస్తామని ప్రచారం చేస్తాం. మూత బడిన పాఠశాలల పునరుద్ధరించి గ్రామ స్థాయిలో ఉన్న అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పిల్లలు తిరిగి స్కూళ్లకు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కె.నారాయణరెడ్డి, డీఈఓ

పాఠశాలలను సిద్ధం చేయండి

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భూదాన్‌పోచంపల్లి: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసి జూన్ 12లోగా సిద్ధం చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే ఆదేశించారు. బుధవారం ఆయన భూదాన్‌పోచంపల్లి మండలం రేవనపల్లి, శివారెడ్డిగూడెంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్లు, మూత్రశాలలు, తలుపులు, డెస్క్ బెంచీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 1నుంచి బడి బాట నిర్వహించాలని, బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి, పీఆర్ ఏఈ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లు, కొనుగోలు కేంద్రం తనిఖీ

రాంలింగంపల్లి పరిధిలో గల కన్యకాపరమేశ్వరీ రైస్ మిల్లును కలెక్టర్ తనిఖీ చేశారు. మిల్లులో ధాన్యం స్టాక్‌ను పరిశీలించారు. అలాగే శివారెడ్డిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోళ్లలో మరింత వేగం పెంచి ఈనెల 31లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. మిల్లుల వద్ద ధాన్యాన్ని ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేసి తిరిగి లారీలను పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలస్యం కాకుండా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లై జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా సరఫరా అధికారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



శివారెడ్డిగూడెం పాఠశాలను సందర్శించిన కలెక్టర్

కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి



మైక్రో అబ్జర్వర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి : జూన్ 4వ తేదీన జరిగే లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో మైక్రో అబ్జర్వర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్లతో సమావేశమై కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కంట్రోల్ యూనిట్లు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు పరిశీలనకు ఎన్నికల కమిషన్ మైక్రో అబ్జర్వర్లను నియమించిందని, ఫలితాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకొని సాధారణ పరిశీలకులకు నివేదికలు సమర్పించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, లీడ్ బ్యాంకు అధికారి రామకృష్ణ, ట్రైనర్లు నర్సిరెడ్డి, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

భూదాన్‌పోచంపల్లి: ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షాలోమ్ ఆదేశించారు. బుధవారం భూదాన్‌పోచంపల్లి మండలం గౌస్‌కొండ, భీమనపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. కొనుగోళ్లు, కేంద్రాల్లోని సమస్యలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. లారీలు, హమాలీల కొరత వల్ల కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని కేంద్రాల నిర్వాహకులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అందుకు ఆయన స్పందిస్తూ కాంటా వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, మిల్లుల వద్ద జాప్యం జరగకుండా అన్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రెండు, మూడు రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీకాంత్ రెడ్డి, ఎంఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ సద్దుపల్లి బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



భీమనపల్లిలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్

చౌటుప్పల్ : పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో బుధవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రిజిస్టర్లు పరిశీలించారు. దుకాణాల్లో ఉన్న ఎరువులు, విత్తన నిల్వలపై ఆరా తీశారు. కొన్ని దుకాణాల్లో వరి విత్తనాల బస్తాలపై కంపెనీ లేబుల్స్, తేదీ, గడువు వివరాలు లేకపోవడాన్ని గుర్తించారు. దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేశారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని టాస్క్‌ఫోర్స్ అధికారులు వెంకటేశ్వర్‌రావు, ముత్యాల నాగరాజు హెచ్చరించారు. విత్తనాలను ప్యాకెట్లలో కాకుండా విడిగా అమ్మినా చర్యలు తప్పవన్నారు. దుకాణాల ఎదుట విత్తన కంపెనీల వివరాలు, ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని పేర్కొన్నారు. వారి వెంట సీఐ అశోక్‌రెడ్డి, మోత్కూర్, అడ్డగూడూరు మండలాల ఏఓలు ఉన్నారు.



చౌటుప్పల్‌లోని ఫర్టిలైజర్ షాపులో రికార్డులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలోనూ టాప్

12 జిల్లాల్లో యాదాద్రి భువనగిరి ఫస్ట్

- 78.59 శాతం పోలింగ్ నమోదు
- అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం
- ఫలించిన స్వీప్ కార్యక్రమాలు



సాక్షి, యాదాద్రి : చైతన్యానికి ప్రతీకగా నిలుస్తున్నారు యాదాద్రి భువనగిరి జిల్లా ఓటర్లు. ఎన్నిక ఏదైనా పోలింగ్‌లో సత్తా చాటుతున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా.. వరంగల్ – ఖమ్మం- నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లోనూ అదే ఒరవడిని కొనసాగించారు. ఎన్నికల యంత్రాంగం చేపట్టిన స్వీప్ కార్యక్రమాలు, రాజకీయ పార్టీల సహకారం వెరసి మూడు ఎన్నికల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది.

విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ శాతం పెంచేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆధ్వర్యంలో అధికారులు విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించారు. ఓటు ప్రాధాన్యత, ఓటు వేసే విధానంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ర్యాలీలు, రన్‌లు, మానవహారాలు నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువచ్చేలా పాఠశాలల్లోనూ ప్రతిజ్ఞలు చేయించారు. ఉపాధిహామీ పనులు జరిగే చోటకు వెళ్లి ఓటు ప్రాధాన్యతపై వివరించారు. మహిళా సంఘాలు, ఉపాధిహామీ, కార్మిక.. ఇలా పలు శాఖలను అనుసంధానం చేసి చైతన్యం తీసుకువచ్చారు.

ఓటర్లతో మమేకమైన పార్టీలు

రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదు కావడానికి రాజకీయ పార్టీలు తీసుకున్న చర్యలు కూడా దోహదపడ్డాయి. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రతి ఓటరు గడప తొక్కారు. సభలు, సమావేశాలు, రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు, సోషల్ మీడియా ద్వారా ఓటర్లతో మమేకం అయ్యారు. వలస ఓటర్లను సైతం పెద్ద సంఖ్యలో రప్పించేందుకు చొరవ తీసుకున్నాయి.

ఇక్కడి ఓటర్లు ఎందరికో ఆదర్శం

ప్రతి ఎన్నికల్లో యాదాద్రి జిల్లాలో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదవుతోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. వరంగల్- ఖమ్మం. నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అత్యధిక పోలింగ్ నమోదవడం అభినందనీయం. రాజ్యాంగం కల్పించిన హక్కును జిల్లా ఓటర్లు సద్విని యోగం చేసుకుంటూ చైతన్యానికి ప్రతీకగా, స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. ఇక్కడి ఓటర్లు ఎందరికో ఆదర్శం. వారందరికీ కృతజ్ఞతలు. పోలింగ్ శాతం పెంచేందుకు చేపట్టిన స్వీప్ కార్యక్రమాలు సత్ఫలితాలు ఇచ్చాయి. అధికార యంత్రాంగం, పోలీసు శాఖ, రాజకీయ పార్టీలకు ధన్యవాదాలు.

–జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే

మూడు ఎన్నికల్లో పోలింగ్ శాతం ఇలా..

అసెంబ్లీ ఎన్నికల్లో ఆలేరు 90.77 శాతం, భువనగిరి నియోజకవర్గంలో 89.91 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తంగా 90.36 శాతంతో జిల్లా రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. లోక్‌సభ ఎన్నికల్లోనూ భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం 82.71 శాతం పోలింగ్‌తో రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. వరంగల్ – ఖమ్మం – పట్టభద్రుల ఉప ఎన్నికల్లోనూ 12 జిల్లాల్లో యాదాద్రి భువనగిరి 78.59 శాతం పోలింగ్‌తో అగ్రభాగాన నిలిచింది. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ 90.77 శాతం ఓట్లతో జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానం దక్కించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా జిల్లాను నంబర్‌వన్ స్థానంలో నిలిపారు.

ఎయిమ్స్‌లో రక్తపోటు దినోత్సవం



మాట్లాడుతున్న ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్ : బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో బుధవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ క్యాంపు కమిటీ ఏర్పాటు చేశారు. క్యాంప్ కార్యకలాపాలను డైరెక్టర్ వికాస్ భాటియా ప్రారంభించి మాట్లాడారు. వైద్య సేవలను మరింత విస్తృతం చేయాలనే ఉద్దేశంతో హెల్త్ క్యాంపు కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే బొమ్మలరామారం మండలం చీకటిమామిడి సబ్‌సెంటర్ పరిధిలో మొబైల్ మెడికల్ యూనిట్ ఏర్పాటు చేశారు. హైపర్ టెన్షన్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, జీవనశైలిలో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నితిన్ అశోక్‌జాన్, మహేశ్వర్, నీరజ్ అగర్వాల్, గోవిందరావు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని ధర్నా



వినతిపత్రం అందిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

మోటకొండూర్: రైతులకు రుణమాఫీ చేయాలని, విత్తనాలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో బుధవారం మోటకొండూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ మొదలైనా విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి రాలేదన్నారు. మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పెట్టుబడి డబ్బులు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శాంతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కల్లెపు అడివయ్య, ఇక్కిరి సహదేవ్, దొంతిరి అంజిరెడ్డి, చిరబోయిన బాలయ్య, గడ్డం నాగరాజు, పంజాల మురళి, సిద్ధేశ్వర, సమరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

జీవనభృతి ఇప్పించండి సారూ..!

- మా కుమారుడు పట్టించుకోవడం లేదు
- వృద్ధ దంపతుల ఆవేదన

ఆత్మకూర్.ఎస్(సూర్యాపేట) : కనీసం అన్నం పెట్టక పోగా.. కష్టపడి సంపాదించిన భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నాడని, ఈ విషయమై న్యాయం కోసం అధికారుల వద్దకు వెళితే.. ప్రతినెలా జీవనభృతి ఇవ్వాల్సిందిగా చెప్పారని, ఆ ఆదేశాలను తమ కుమారుడు పట్టించుకోవడం లేదని వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మకూర్.ఎస్ మండలం పాత సూర్యాపేట గ్రామ పంచాయతీ పరిధిలోని శంకరన్నగూడెంకు చెందిన సామ పాపిరెడ్డి, సుగుణమ్మ దంపతులకు కుమారుడు సామ శంకర్‌రెడ్డితో పాటు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలందరికీ వివాహాలు జరిగాయి. గ్రామంలో పాపిరెడ్డికి రెండెకరాల పొలం ఉంది. శంకర్‌రెడ్డి హైదరాబాదులో ప్రైవేట్ జాబ్ చేస్తూ అక్కడే స్థిరపడ్డాడు. పదేళ్ల క్రితం తల్లిదండ్రులకు తెలియకుండానే రెండెకరాల భూమిని తన పేరు పట్టా చేయించుకున్నాడు. నాటి నుండి తమపై కుమారు శంకర్‌రెడ్డితో పాటు కోడలు వేధింపులు ఎక్కువయ్యాయని ఆ వృద్ధ దంపతులు తెలిపారు. పొలాన్ని సాగు చేసుకోనివ్వకుండా అడ్డుకోవడంతో పాటు ఇంట్లోంచి వెళ్లిపోవాలని పలుమార్లు తమతో శంకర్ రెడ్డి ఘర్షణ పడ్డారని, తమకు గాయాలయ్యాయని పాపిరెడ్డి, సుగుణమ్మ చెప్పారు. పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు.


పాపిరెడ్డి, సుగుణమ్మ దంపతులు

ఆర్డీఓ ఆదేశాలు బేఖాతరు...

వృద్ధాప్యంలో ఉన్న తాము జీవనానికి ఇబ్బందులు పడుతున్నామని, నెలనెలా మందులకు ఖర్చు అవుతుందని పింఛన్ మీదనే ఆధారపడి కాలం వెళ్లదీస్తున్నామని అంటున్నారు. తమకు జీవనభృతి ఇప్పించాలని మార్చి నెలలో కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోగా సూర్యాపేట ఆర్డీఓను విచారణ జరపాలని ఆదేశించారు. దీంతో విచారణ జరిపిన ఆర్డీఓ వేణుమాధవ్‌రావు.. ప్రతినెలా భృతికింద రూ.10వేలు వారి ఖాతాలో జమ చేయాలని, రూ.2లక్షలను తల్లిదండ్రుల పేరున డిపాజిట్ చేయాలని మార్చి 5వ తేదీన ఉత్తర్వులు జారీచేశారు. అయినా ఈ ఉత్తర్వులను తమ కుమారుడు శంకర్‌రెడ్డి అమలు చేయడం లేదని, పైసా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతిలో డబ్బులు లేకపోవడంతో ఒక్కోసారి ఉపవాసం ఉండాల్సి వస్తుందని, ఉపాధి హామీ పనికి పోయి కాలం వెళ్లదీస్తున్నామని చెప్పారు. కొన్నిసార్లు తమ కూతుళ్లు ఆదుకుంటున్నారని, వారి మీద ఆధారపడి బతకాల్సి వస్తుందని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

ఆదేశాలు పాటించాలి

శంకన్నగూడెంకు చెందిన పాపిరెడ్డి దంపతులకు వారి కుమారుడు ప్రతినెలా రూ.10వేల జీవనభృతి ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చాం. జీవనభృతి ఇవ్వడం లేదన్న విషయం మా దృష్టికి రాలేదు. మా ఆదేశాలను పాటించకుంటే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– వేణుమాధవ్‌రావు, సూర్యాపేట ఆర్డీఓ

సూర్యాపేట ఎస్పీ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా

- ఎవరూ స్పందించవద్దన్న ఎస్పీ

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే పేరుతో సైబర్ నేరగాళ్లు రెండు నకిలీ ఫేస్‌బుక్ ఖాతాలను క్రియేట్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఎస్పీ రాహుల్ హెగ్డే పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా ద్వారా ఫ్రెండ్ రిక్వెస్ట్ రావడంతో చాలామంది యాక్సెప్ట్ చేశారు. కొద్దిసేటికే వారితో మెస్సెంజర్‌లో చాటింగ్ ప్రారంభించి కొంత మొత్తం నగదు కావాలని.. ఫోన్‌పే చేస్తే రేపే తిరిగిచ్చేస్తా అంటూ మెసేజ్ చేస్తున్నారు. ఇది గమనించిన కొంతమంది పోలీసులు ఎస్పీకి సమాచారం ఇవ్వడంతో ఆయన అప్రమత్తమై బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తన పేరుపై నకిలీ ఫేస్‌బుక్ ప్రొఫైల్ క్రియేట్ చేశారని, దానికి ఎవరూ స్పందించవద్దని, డబ్బులు పంపించవద్దని కోరారు. ఫేస్‌బుక్ నుంచి ఎవరైనా నంబర్ అడిగినా, డబ్బులు అడిగినా ఇవ్వొద్దన్నారు. ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

భూమి గెట్టు వివాదం.. యువకుడి ఆత్మహత్యాయత్నం

నార్కట్‌పల్లి: భూమి గెట్టు వివాదంతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నం చేశఋూడు. ఈ ఘటన బుధవారం నార్కట్‌పల్లి మండలం చిన్ననారాయణపురం గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లికి చెందిన జినకల ఆనంద్‌కు చిన్ననారాయణపురం గ్రామంలో భూమి ఉంది. ఆనంద్‌కు, అతడి పక్కన భూమి ఉన్న వ్యక్తుల మధ్య గత రెండు నెలలుగా గెట్టు వివాదం కొనసాగుతోంది. బుధవారం ఆనంద్ భూమి వద్ద ఇతరులు హద్దురాళ్లు పాతుతుండగా.. అతడి కుమారుడు జినకల కార్తీక్ అడ్డుకొని తమ భూమిలో ఎందుకు హద్దురాళ్లు పాతుతున్నారని నిలదీశాడు. దీంతో వారి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో కార్తీక్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చుట్టుపక్కల ఉన్న వారు అడ్డుకొని కార్తీక్‌ను వెంటనే నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు.


పురుగుల మందు డబ్బాతో కార్తీక్

క్లుప్తంగా

నిరుపేద వృద్ధురాలి అంత్యక్రియలకు చేయూత

రామన్నపేట: గ్రామస్తుల చేయూతతో నిరుపేద వృద్ధురాలి అంత్యక్రియలు నిర్వహించిన ఘటన రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామంలో బుధవారం జరిగింది. వివరాలు.. బతుకుదెరువు నిమిత్తం సంస్థాన్ నారాయణపురం నుంచి తిరందాసు కమలమ్మ(75) అనే మహిళ కొన్నేళ్ల క్రితం తన కుమారుడితో కలిసి వెల్లంకి గ్రామానికి వలస వచ్చింది. వారు వెల్లంకి శివాలయం ప్రాంగణంలో తాత్కాలిక గుడారం(బస్తాలతో) ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కమలమ్మ బుధవారం మృతిచెందింది. ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్‌రెడ్డి రూ.5వేలు, మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి రూ.5వేలు, గ్రామస్తులు తమకు తోచినంత అందజేసిన ఆర్థికసాయంతో కమలమ్మ అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

వలిగొండ: మండలంలోని టేకులసోమారం సమీపంలో లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. తుర్కపల్లి మండలం పెద్దతండాకు చెందిన మాలోత్ భూచ్యా ద్విచక్ర వాహనంపై వలిగొండ మండలంలోని పొద్దటూర్ నుంచి తాటిముంజలు తీసుకొని హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో టేకులసోమారం సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భూచ్యాకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వీధి కుక్కల దాడి.. వృద్ధుడికి గాయాలు


గాయపడిన సాయిలు

ఆత్మకూరు(ఎం): వీధి కుక్కల దాడిలో వృద్ధుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆత్మకూరు(ఎం)మండలంలోని పల్లెర్ల గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్లెర్ల గ్రామానికి చెందిన తాడూరి సాయిలు బుధవారం మధ్యాహ్నం తన ఇంటి ఆవరణలో నిద్రించగా.. వీధి కుక్కలు ఒక్కసారిగా అతడిపై దాడి చేశాయి. ఈ ఘటనలో సాయిలు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

ట్రాక్టర్ బోల్తాపడి బాలుడు మృతి


విష్ణువర్ధన్ (ఫైల్)

మునుగోడు: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం మునుగోడు మండలం కొరటికల్ గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరటికల్ గ్రామానికి చెందిన అన్నం నరేష్ తన పెద్ద కుమారుడు విష్ణువర్ధన్(16)తో కలిసి ట్రాక్టర్‌పై గ్రామంలోని కోమటికుంట కట్ట మీదుగా తన వ్యవసాయ భూమి వద్దకు బుధవారం సాయంత్రం సమయంలో వెళ్తున్నాడు. అయితే కట్టపై ట్రాక్టర్ అదుపుతప్పడంతో బోల్తా పడింది. ఇది గమనించిన నరేష్ పక్కకు దూకగా.. పక్కనే కూర్చున్న అతడి కుమారుడు విష్ణువర్ధన్ ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మునుగోడు పోలీసులు తెలిపారు.

వాలీబాల్ పోటీలో పందెం డబ్బులపై వివాదం

- పరస్పరం దాడి చేసుకున్న రెండు జట్ల సభ్యులు
- ఐదుగురిపై కేసు నమోదు

మిర్యాలగూడ అర్బన్: వాలీబాల్ పోటీలో రెండు జట్ల మధ్య పందెం డబ్బులపై జరిగిన వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మిర్యాలగూడ మండలంలోని చింతపల్లి గ్రామం, దామరచర్ల మండలం దిలావర్‌పూర్‌కు చెందిన యువకులు ఇటీవల వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మొదట నిర్వహించిన పోటీలో దిలావర్‌పూర్ జట్టు గెలుపొందగా.. రెండోసారి నిర్వహించిన పోటీలో చింతపల్లి జట్టు గెలిచింది. ఈ రెండు జట్ల మధ్య పందెం డబ్బులు రూ.1000 విషయంలో వివాదం నెలకొంది. మొదట దిలావర్‌పూర్ జట్టు వారు చింతపల్లి జట్టు యువకులపై దాడి చేశారు. ఈ దాడిని దృష్టిలో ఉంచుకుని దిలావర్‌పూర్ జట్టులో సభ్యుడైన మిర్యాలగూడ పట్టణంలోని మెడికల్ షాపులో పనిచేసే నవీన్ అనే యువకుడిని చింతపల్లి జట్టు యువకులు చితకబాదగా.. వారిని అడ్డుకోబోయిన మరో యువకుడు రాకేష్‌ను సైతం తీవ్రంగా కొట్టారు. ఈ దాడి జరుగుతున్న దృశ్యాలను కొందరు సెల్‌ఫోన్లలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వెలుగులోకి వచ్చింది. ఈ గొడవకు సంబంధించి ఐదుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు మిర్యాలగూడ వన్‌టౌన్ ఎస్‌ఐ రాంబాబు పేర్కొన్నారు.


యువకుడిని చితకబాదుతున్న దృశ్యం

‘పుడమి’ బాధితుల న్యాయ పోరాటం

- ప్రత్యేక సంఘం ఏర్పాటు
- ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడేందుకు కార్యాచరణ రూపకల్పన

మునుగోడు: అధిక వడ్డీ ఆశచూపి లక్షల రూపాయలు వసూలు చేసి అజ్ఞాతంలోకి వెళ్లిన పుడమి ప్రాజెక్ట్స్ కంపెనీ నిర్వాహకులపై న్యాయ పోరాటం చేసేందుకు బాధితులు సిద్ధమవుతున్నారు. పుడమి ప్రాజెక్ట్స్ కంపెనీలో పెట్టుబడి పెట్టిన వారికి గత ఏడాది కాలంగా వడ్డీ ఇవ్వకపోగా, వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తామన్న ప్లాట్లు కూడా ఇవ్వకుండా కాలయాపన చేసిన నిర్వాహకులు బాధితుల ఒత్తిడి తట్టుకోలేక ఇటీవల అజ్ఞాతంలోకి వెళ్లారు. ఈ విషయాన్ని గత నెల 16వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురించగా బాధితులు అప్రమత్తమయ్యారు. ఆ రోజు నుంచి తమ చేత పెట్టుబడులు పెట్టించిన ఆ కంపెనీ డీజీఎం(కమీషన్ ఏజెంట్లు) వద్దకు వెళ్లి తమ డబ్బులు తమకు ఇవ్వాలని బాధితులు కోరారు. దీంతో ఆ ఏజెంట్లు తమ చేతిలో ఏమీ లేదని, కంపెనీ ఏర్పాటుచేసిన ముగ్గురి వద్దనే మొత్తం నగదు ఉందని, ఆ ముగ్గురు బయటికి వస్తేనే మీ డబ్బులు మీకు ఇపిస్తామని చెప్పారు. దీంతో పెట్టుబడి పెట్టిన వారంతా ఏమిచేయలో అర్థంకాక గత 15 రోజులుగా పుడమి ప్రాజెక్ట్స్ కంపెనీ నిర్వాహకుల గురించి ఆరా తీస్తున్నా ఎక్కడా వా.9రి ఆచూకీ లభించకపోవడంతో తమ చేత డబ్బులు పెట్టుబడి పెట్టించిన డీజీఎంలతో పాటు పుడమి కంపెనీ నిర్వాహకులపై న్యాయ పోరాటం చేయాలని నిర్ణయించుకున్నారు.


ఘట్‌కేసర్‌లో సమావేశమైన పుడమి ప్రాజెక్ట్స్ బాధితులు

సంఘం ఏర్పాటు చేసుకున్న బాధితులు..

బాధితులంతా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకుని ప్రతిరోజు తమ బాధలను పంచుకునేవారు. ఐక్యంగా పోరాడితే తమకు న్యాయం జరుగుతుందని భావించిన బాధితులంతా మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని న్యాయ పోరాటం చేసేందుకు గాను డివైన్ అండ్ పుడమి ఇన్‌ఫ్రా బాధితుల సంఘం అనే పేరుతో సంఘం ఏర్పాటు చేసుకున్నారు. న్యాయం జరగాలంటే ప్రజాస్వామ్య పద్ధతిలో ఎలా ముందుకెళ్లాలి, ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలనే విషయాలను చర్చించుకున్నారు. అంతేకాకుండా మోసగాళ్లు అని ఓ ఫ్లెక్సీ ముద్రించి ఆ కంపెనీని కొనసాగించిన వారి ఫొటోలతో పాటు వారి పేర్లను ముద్రింపజేశారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి రోడ్డున పడ్డ తమను పోలీసులు ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

- అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు


మావిళ్ల వెంకటేష్ (ఫైల్)

చింతపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయ్యి బుధవారం మృతి చెందాడు. వైద్యుల సూచన మేరకు మృతుడి కుటుంబ సభ్యులు అతడి అవయవాలను దానం చేశారు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన ప్రకారం.. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన మావిళ్ల వెంకటేష్(25) గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 24న బైక్‌పై మాల్‌లో పత్తి విత్తనాలు కొనుగోలు చేసేందుకు వెళ్తుండగా.. హైదరాబాద్ నుంచి మల్లేపల్లి వైపు వస్తున్న కారు ఎదురుగా వచ్చి వెంకటేష్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం అతడిని హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయ్యి బుధవారం మృతిచెందాడు. వైద్యుల సూచన మేరకు వెంకటేష్ గుండె, కిడ్నీలను కుటుంబ సభ్యుల దానం చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామమైన చింతపల్లికి తీసుకొచ్చారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.


పోలీసులతో వాగ్వాదానికి దిగిన బంధువులు

కుటుంబ సభ్యుల ధర్నా..

అయితే ప్రమాదానికి కారణమైన కారు యజమాని నుంచి రూ.20లక్షల పరిహారం అందించాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు చింతపల్లి మండల కేంద్రంలోని ఇన్‌స్పెక్షన్ బంగ్లా వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్య, చింతపల్లి ఎస్‌ఐ యాదయ్య అక్కడకు చేరుకుని వారికి ఎంత నచ్చజెప్పినా వినిపించుకోకుండా వాగ్వాదానికి దిగారు. స్థానిక నాయకులు కలగజేసుకొని పరిహారం ఇప్పించేలా చూస్తామని నచ్చజెప్పడంతో సమస్య సద్దుమణిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ యాదయ్య తెలిపారు.

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి బలవన్మరణం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిడమనూరు: గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నిడమనూరు మండలంలోని వెంగన్నగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగన్నగూడెం శివారులో గల గోదాంలో సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి రెండు మూడ్రోజుల కిందట పత్తి తూకానికి వాడే స్టాండ్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కడ పనిచేసే గూర్ఖా బహదూర్ మూడు, నాలుగు రోజులకు ఒకసారి గేదెలకు గడ్డి తేవడానికి గోదాం వద్ద వెళ్తుంటాడు. బుధవారం గూర్ఖా గడ్డి తేవడానికి గోదాం వద్దకు వెళ్లిన సమయంలో దుర్వాసన వస్తుండడంతో లోపలికి వెళ్లి చూడగా గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామ పంచాయతీ కార్యదర్శి శోభారాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. హాలియా సీఐ జనార్దన్, ఎస్‌ఐ నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య


నితిన్ (ఫైల్)

భువనగిరి క్రైం: కుటుంబ కలహాలతో కలత చెందిన యువకుడు క్వారీ గుంతలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భువనగిరి పట్టణ పరిధిలోని రాంచంద్రాపురం రోడ్డులో బుధవారం జరిగింది. వివరాలు.. యాదగిరిగుట్ట మండలం చొల్లేరుకు చెందిన దొంతిసారం శంకర్ కుటుంబ సభ్యులతో భువనగిరి పట్టణంలోని ఆజాద్ రోడ్‌లో నివాసముంటున్నాడు. ఈ నెల 25, 26 తేదీల్లో సొంతూరు చొల్లేరులో బోనాల పండుగ ఉండడంతో కుటుంబంతో కలిసి వెళ్లాడు. శంకర్‌కు ముగ్గురు సోదరులు ఉన్నారు. అయితే గతంలో ఉమ్మడి కుటుంబంగా బోనాలు తీయగా.. అన్నదమ్ములు వేర్వేరుగా బోనాలు తీయాలని నిర్ణయించుకున్నారు. కానీ చొల్లేరు వెళ్లిన శంకర్ భార్యాపిల్లలను వదిలి తన సోదరుల ఇళ్లకు వెళ్లి భోజనం చేసి వచ్చాడు. వేర్వేరుగా బోనాలు తీయాలని నిర్ణయించుకొని, మళ్లీ సోదరుల ఇంటికి వెళ్లి భోజనం ఎలా చేసి వస్తావని శంకర్‌కు తన భార్య, పిల్లలకు మధ్య గొడవ జరిగింది. బోనాల పండుగ అనంతరం భువనగిరికి వచ్చిన తర్వాత కూడా ఇదే విషయమై వారి మధ్య మరోసారి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన శంకర్ కుమారుడు దొంతిసారం నితిన్(19) బుధవారం భువనగిరి పట్టణ పరిధిలోని రాంచంద్రాపురం రోడ్డులో గల క్వారీ గుంతలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. నితిన్ మృతదేహానికి భువనగిరి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువుల ఆందోళన

- మిర్యాలగూడ పట్టణంలో ఘటన

మిర్యాలగూడ అర్బన్: వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరిన వ్యక్తి మృతిచెందాడని అతడి బంధువులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో బుధవారం రాత్రి జరిగింది. వివరాలు.. మిర్యాలగూడ మండలం పరిధిలోని వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన శేఖర్(30) మంగళవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో కుటుంబ సభ్యులు మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆ యువకుడు పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. కాగా ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శేఖర్ మృతిచెందాడని అతడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని వారితో మాట్లాడారు. మధ్యవర్తుల జోక్యంతో మృతుడి కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

బావిలోని నీరు కలుషితం.. చేపలు మృతి

భువనగిరి టౌన్: పట్టణంలోని ఖాజీమొహల్లాలోని జమాలుల్ బహార్ దర్గా ఆవరణలో ఉన్న బావిలోని చేపలు బుధవారం మృత్యువాత పడ్డాయి. దర్గా వద్దకు వచ్చే వారు చేపల కోసం బ్రెడ్, ఇతర వస్తువులు నీటిలో వేస్తారని.. అవి కుళ్లిపోయి లేదా కల్తీ జరగడంతో నీరు విషతుల్యమై చేపలు మృతిచెంది ఉంటాయని స్థానికులు, ఆ వార్డు కౌన్సిలర్ స్వామి తెలిపారు. మున్సిపల్ సిబ్బంది చనిపోయిన చేపలను బావిలో నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. బావిలోని నీటిని మొత్తం తీసి తిరిగి శుద్ధమైన నీటితో నింపుతామని తెలిపారు.


మృతిచెందిన చేపలు

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రామగిరి(నల్లగొండ): హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు సెషన్స్ కోర్టు జడ్జి ఎన్. రోజారమణి బుధవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. తిరుమలగిరి మండలం రంగుండ్ల గ్రామానికి చెందిన అంగోతు హనుమ(20) తన స్నేహితుడు ధారావత్ పాండుతో కలిసి 2014 ఏప్రిల్ 19వ తేదీ రాత్రి చేపలు పట్టేందుకు రాజవరం చెరువు వద్దకు వెళ్లారు. చెరువుకు కాపలా ఉన్న సొడబోయిన లింగయ్య వారిని చూసి కేకలు వేయగా.. పాండు తప్పించుకుని పారిపోయాడు. అక్కడే ఉన్న హనుమ తలపై లింగయ్య కర్రతో గట్టిగా మోదడంతో అతడు నీటిలో పడి మృతిచెందాడు. మరుసటి రోజు హనుమ మృతదేహం నీటిపై తేలియాడుతుండడంతో లింగయ్య మృతదేహాన్ని పక్కనే ఉన్న చెట్ల పొదల్లో పడేశాడు. అనంతరం హనుమ మృతదేహాన్ని గుర్తించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి తండ్రి పుల్యా అనుముల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న అప్పటి మిర్యాలగూడ డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్, అనుముల ఎస్‌ఐ భోజ్యా నాయక్ కేసు నమోదు చేసి విచారణ అనంతరం నిందితుడు లింగయ్యను కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసు తుది విచారణలో భాగంగా బుధవారం జడ్జి ఎన్. రోజారమణి సాక్ష్యాధారాలు పరిశీలించి నిందితుడు సొడబోయిన లింగయ్యకు జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నేరేడుచర్ల: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని బుధవారం రాత్రి నేరేడుచర్ల పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా మిర్యాలగూడకు చెందిన చిట్టిపోలు పర్వతాలు, ఆయన అనుచరుడు దేవరబోయిన పల్లయ్య బొలేరో వాహనంలో రెండు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పట్టుబడ్డారు. బియ్యాన్ని, బొలేరో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి.. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దొంగలకు దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

భువనగిరి క్రైం: పట్టణంలోని హుస్నేనాబాద్ పరిధిలో గల ఇందిరమ్మ కాలనీ వద్ద విద్యుత్ వైర్లు దొంగతనం చేస్తున్న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులకు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలు.. ఇందిరమ్మ కాలనీ వద్ద ఇటీవల విద్యుత్ అధికారులు కొత్త విద్యుత్ లైన్ వేయగా అక్కడ వేలాడుతున్న కరెంట్ వైర్లను ఇద్దరు వ్యక్తులు దొంగిలిస్తుండగా స్థానికులు గమనించి వారిని నిలదీశారు. కొద్దిదూరం వెళ్లిన వారు మళ్లీ అదే ప్రయత్నం చేస్తుండగా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పట్టణ ఎస్‌ఐ నాగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిషేధిత గుట్కా స్వాధీనం


సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని పలు కిరాణా దుకాణాల్లో బుధవారం పోలీసులు తనిఖీలు నిర్వహించి 1264 నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.8వేలు ఉంటుందని, నిషేధిత గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్న పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పరమేష్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరు దుర్మరణం

- మరొకరికి తీవ్రగాయాలు

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని గోపాలపురం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం వెంకటరామాపురానికి చెందిన కుర్రా సైదులు(40)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతడు కొంతకాలంగా మఠంపల్లి మండలం చౌటపల్లిలో బంధువుల వద్ద కుటుంబంతో కలిసి నివసిస్తూ స్థానిక సిమెంట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ నెల 27న స్వగ్రామం వెంకటరామాపురంలో నిర్వహించిన గంగమ్మ జాతరకు కుటుంబంతో కలిసి వెళ్లాడు. బుధవారం తిరుగు ప్రయాణంలో గరిడేపల్లి వద్ద తన భార్య రమాదేవిని ఆర్టీసీ బస్సు ఎక్కించిన సైదులు బైక్‌పై తన కుమార్తె సామికతో పాటు హుజూర్‌నగర్‌లో ఉండే తన తమ్ముడి కుమార్తె శ్రీనిధి(10)ని బైక్‌పై ఎక్కించుకుని మఠంపల్లి మండలం చౌటపల్లికి బయల్దేరాడు. మార్గమధ్యలో హుజూర్‌నగర్ మండలం గోపాలపురం వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ముగ్గురూ రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో సైదులు, శ్రీనిధిలు అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన సోమికను 108 వాహనంలో స్థానికులు హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. మృతుడి భార్య రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.


ఘటనా స్థలంలో సైదులు, శ్రీనిధి మృతదేహాలు, గాయపడిన సోమిక

దిగుబడి రాకపోవడంతో మామిడి తోట తొలగింపు

నడిగూడెం : సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన బండారు పుల్లయ్య తనకున్న ఎకరం మామిడి తోట మూడు సంవత్సరాలుగా కాత సరిగ్గా కాయకపోవడంతో దిగుబడి రావడం లేదు. దీంతో ఎకరం విస్తీర్ణంలో ఉన్న మామిడి తోటను తొలగించాడు. 20 ఏళ్లుగా పెంచుకున్న తోటను తొలగించి ఇదే భూమిలో వరి సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నాడు.


శ్రీరంగాపురంలో తొలగించిన మామిడి తోట